క్లుప్తంగా

గోకవరం మండల జేకేసీ వాయిదా

సీటీఆర్‌ఐ: గోకవరంలో బుధవారం జరగాల్సిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కలెక్టర్ కె.మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో తెలియజేస్తామన్నారు.

నేడు కొమరిపాలెంలో జగనన్న సురక్ష

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు జి.విజయలక్ష్మి సోమవారం తెలిపారు. కార్యక్రమాన్ని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వైద్యశిబిరం

మధురపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోరుకొండ-1 సచివాలయంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. బీపీ, షుగర్‌తో పాటు, కంటి సంబంధిత సమస్యలకు పరీక్షలు చేస్తారన్నారు.

సమ్మెను జయప్రదం చెయ్యండి

రంగంపేట: గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం అక్టోబరు 4న చేపట్టనున్న ఒక్క రోజు సమ్మెను జయప్రదం చేయాలని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాజమహేంద్రవరం డివిజన్ కార్యదర్శి పైడిశెట్టి భూలోకం కోరారు. సోమవారం ఆయన వడిశలేరులో మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గ్రామీణ తపాలా ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొనాలన్నారు.

నేడు బిక్కవోలులో గడప గడపకూ..

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి రామకోవెల సమీపంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. బాల గణపతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం జరిపారు. స్థానికులతో పాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



ఊరేగింపులో ఆకట్టుకున్న వేషధారణలు

గోకవరం: గణపతి నవరాత్రులు ముగియడంతో గ్రామాల్లోని వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. స్థానిక గుబ్బాలమ్మ ఆలయం సమీపంలో ప్రతిష్ఠించిన గణేశ్ విగ్రహాన్ని సోమవారం నిమజ్జనం చేశారు. తొలుత ఆలయ కమిటీల ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ అంగరంగ వైభవంగా స్వామివారిని ఊరేగించారు. ఊరేగింపులో తీన్‌మార్ డ్యాన్సులు, కాంతారా, శక్తి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

అనపర్తి: అనపర్తి బ్లడ్ డోనర్స్ యాప్ రూపకర్త సత్తి రామకృష్ణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం 13వ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా సత్యసాయి జయంతి

ప్రకాశం నగర్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శ్రీరాంనగర్‌లో 9వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధ సేవాసమితుల నుంచి వచ్చిన భక్తులు సుమారు 9 గంటల పాటు నిరివ్రామంగా సత్యసాయి నామసంకీర్తన చేశారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలు, ప్రశాంతి యాత్ర, 108 కోట్ల లిఖిత నామం, 108 గంటల సామూహిక భజనలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు, ఆధ్యాత్మిక, సేవా, విద్యా , యువజన విభాగ సమన్వయకర్తలు ఎన్వీ సాయిరాం, రామలక్ష్మి, రోహిణి కుమార్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కాకినాడ వెళ్లి పింఛన్ పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: డయాలసిస్‌తో బాధపడుతున్న కొంతమూరు గ్రామానికి చెందిన నర్ల వీర వెంకట సత్యనారాయణమూర్తిరాజు కాకినాడలో కుమార్తె ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్ కోమలి ఇందు సోమవారం కాకినాడ వెళ్లి మూర్తి రాజుకు డయాసిస్ పెన్షన్ రూ.10 వేలు అందజేశారు.

ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది

- ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు
- చిన్నారులకు అర్థమయ్యేలా పాఠాలు



అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులు

అనపర్తి: ప్రీ ప్రైమరీ విద్య నాణ్యంగా అందితే ఆ బిడ్డ భవిష్యత్ అంత ఉజ్వలంగా ఉంటుందని నమ్మిన రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంట్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూల్స్‌గా రూపుదిద్దుకున్నాయి. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలన్నీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందించడానికే పరిమితమయ్యేవి. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రీ ప్రైమరీ స్కూల్స్‌గా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసి ఇంగ్లిష్ మాధ్యమంలో బోధనను ప్రవేశపెట్టి చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోంది.

ఆకట్టుకునేలా బోధన

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఇప్పటికే ప్రీప్రైమరీ స్కూళ్లుగా మార్పు చేసింది. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో, వారిలో అవగాహన పెంపొందించే విధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సిలబస్‌ను రూపొందించారు. చిన్నారుల అవసరమైన కిట్లను ప్రభుత్వం సమకూర్చడంతో పాటు ప్రీ ప్రైమరీ స్కూళ్లలో చిన్నారులకు ఇంగ్లిష్ బోధించేందుకు గాను అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణనిచ్చారు. ఈ నూతన విధానంలో చిన్నారులకు ఇంగ్లిష్, మాథ్స్, వర్క్ బుక్, యాక్టివిటీ పుస్తకాలను అందించారు. చిన్నారులను ఆకట్టుకునేలా బొమ్మలతో పుస్తకాలను తయారు చేశారు. వివిధ రకాల బొమ్మలు, ఆటపాటలతో బోధన సాగుతోంది. ఇంగ్లిష్ అక్షరాలు, అంకెలు పలకడం కోసం స్పోకెన్ ఇంగ్లిష్, వర్క్‌బుక్‌లో ' అ' అక్షరం నుంచి 'ౠ' వరకూ పొందుపరిచారు. గణిత వర్క్‌బుక్‌లో ఒకటి నుంచి పదెంకల వరకూ పరిచయం, యాక్టివిటీ బుక్‌లో బొమ్మలు గీయడం, బొమ్మలకు రంగులు వేయడం వంటి అంశాలను చేర్చారు.

రంగంపేట ప్రాజెక్ట్ పరిధిలో

రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అనపర్తి, రంగంపేట, బిక్కవోలు మండలాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ పరిధిలో 182 అంగన్‌వాడీ కేంద్రాలు, 1 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కలిపి మొత్తంగా 183 కేంద్రాలున్నాయి. 8,224 మంది చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. ప్రాజెక్ట్ పరిధిలో 181 మంది అంగన్‌వాడీ టీచర్లు, 178 మంది సహాయకులుగా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన విద్యా విధానం చిన్నారులకు పూర్వ ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియంపై ఆసక్తిని పెంచుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

రెండు తరగతులుగా విద్యాబోధన



అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్స్‌లో విద్యార్థులను వయసుల వారీగా రెండు తరగతులుగా విభజిస్తున్నాం. ప్రీ ప్రైమరీ-1లో మూడేళ్లు నిండిన చిన్నారులు ఉంటారు. ప్రీ ప్రైమరీ-2 నాలుగేళ్లు నిండిన పిల్లలు ఉంటారు. ఆ వయసు పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఆట, పాటలతో విద్యాబోధన అందిస్తున్నాం.

– జి.జెస్సీ ఫ్లోరెన్స్, సీడీపీఓ, రాయవరం

బలమైన పునాది వేస్తున్నాం



మూడు, నాలుగేళ్ల పిల్లలకు బొమ్మలు, ఆటపాటలతో బోధన చేస్తే వారు సులువుగా అర్థం చేసుకోగలుగుతారు. పాఠాలను పాటల రూపంలో చెప్పడంతో వారు అలవోకగా నేర్చుకునే అవకాశముంది. ఆ విధంగా వారికి విద్యలో బలమైన పునాది వేస్తున్నాం.

– కె.వాణి, సూపర్‌వైజర్, రంగంపేట

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



పందలపాకలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సచివాలయ సిబ్బంది

బిక్కవోలు: మండలంలోని పందలపాక సచివాలయం-1 వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సచివాలయ సిబ్బంది సోమవారం క్షీరాభిషేకం చేశారు. సచివాలయ వ్యవస్థ ప్రారంభమైన అక్టోబర్ రెండో తేదీని పురస్కరించుకుని పందలపాక సచివాలయం-1, 2 సిబ్బంది కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో క్రాంతి, పోతుల మణికంఠ, భాస్కర్‌రెడ్డి, బాలకృష్ణ, అనంతలక్ష్మి, వెలగల విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం రూరల్: పరిశుభ్రత పరిరక్షణ కోసం అహర్నిశలు పనిచేసే శానిటేషన్ సిబ్బందిని సన్మానించడం ద్వారా వారి సేవలకు గుర్తింపు నివ్వడం మనందరిపై ఉన్న సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. పిడింగొయ్యిలోని మీనాక్షి ఎన్‌క్లేవ్ కల్యాణ మండపంలో సోమవారం స్వచ్ఛతాహీ సేవ ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ మాధవీలత, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్లాప్‌మిత్రలను, ఈవోపీఆర్డీలను, పంచాయతీ కార్యదర్శులను సన్మానించారు. ఈ వేడుకల్లో భాగంగా క్లాప్‌మిత్రలతో కలిసి తేనీటి విందు స్వీకరించారు.

క్లాప్‌మిత్రలకు సత్కారం

రాజమండ్రి డివిజన్ పరిధిలో డి.ముత్యాలు, జి.వెంకటేశ్వరరావు, చంద్రమ్మ, ఎం.అన్నవరం, ఎస్.సత్తిపండు, ఎస్.సూకరాజు, సీహెచ్.ప్రసాద్, వి.చిన్నోడు, కె.తాతారావు, జి.అబ్బులు, కొవ్వూరు డివిజన్ పరిధిలో వి.వెంకటేశ్వరరావు, జి.వెంకన్న, బి.వెంకట్రావు, వి.లక్ష్మి, ఎస్.ఏడుకొండలు, ఎన్.రాజారావు, ఏ.ప్రసాద్, ఎస్.చిన శ్రీను, డి.పవన్‌ను సన్మానించారు. ఈవోపీఆర్డీలకు సంబంధించి నిడదవోలు (ఇన్‌చార్జి) పి.రత్నమాలిక, కోరుకొండ బీఎం ప్రతాప్, బిక్కవోలు జి.భవాని, గోకవరం ఎం.రాజేశ్వరరావు, పిడింగొయ్యి జూనియర్ అసిస్టెంట్ బి.మనోజ్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి (బొమ్మూరు), ఎల్.రవికుమార్ (చాగల్లు), ఎం.ముత్యం (ఐ.పంగిడి), వి.శ్రీనివాసరావు(కాల్దరి)ని సన్మానించారు. కార్యక్రమంలో కొవ్వూరు డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కోఆర్డినేటర్ ఆరమ్‌స్ట్రాంగ్ పాల్గొన్నారు.

మహాత్ముని బాటలో పయనిద్దాం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



అనపర్తిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



రాజానగరంలో మహాత్ముని విగ్రహానికి నివాళి



కోరుకొండలో గాంధీ జయంత్యుత్సవం



ఆరికరేవులలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి

అనపర్తి: దేశం కోసం ప్రాణాలర్పించిన మహాత్ముడి బాటలో పయనిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ 154వ జయంతి సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు గాంధీబొమ్మ సెంటర్‌లోని మహాత్ముని విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మహనీయుడు గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గం ప్రతిఒక్కరికీ అనుసరణీయమన్నారు. అనంతరం కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామ సచివాలయం-1లో పారిశుధ్య కార్మికులతో కలిసి ఎమ్మెల్యే టీ తాగి పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, నల్లమిల్లి మురళీ మోహన బాలకృష్ణారెడ్డి, చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రామవరంలో నిర్వహించిన బాపూజీ జయంతి వేడుకల్లో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గిరడా గంగాభవాని పాల్గొన్నారు.

పెదపూడి: గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో సాధ్యమైందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడలో గాంధీజీ జయంతి సందర్భంగా ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ మున్ని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. స్వచ్ఛాతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కేతా శ్రీలక్ష్మి, కర్రి వెంకటపద్మావతి తదితరులు పాల్గొన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం జాతిపిత జయంతిని పురస్కరించుకుని గాంధీజీ చిత్రపటానికి కాకినాడ డివిజనల్ పంచాయతీ అధికారి అన్నామణి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతాతులసి, ఎంపీడీఓ విజయభాస్కర్, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని ఆరికరేవులలో సోమవారం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అహింస, సత్యం అనే శాంతియుత మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన గొప్ప వ్యక్తి గాంధీజీ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు తొండాపు గాంధీరెడ్డి, ఎంపీటీసీ కొర్ల చక్రధరరావు, ఉప సర్పంచ్ శాఖ రాజు, రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కొమరిపాలెం గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు ముత్యాల మహేష్, బిక్కవోలు గ్రామానికి చెందిన ధనాల ముత్యాలు రాజమహేంద్రవరంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ఈవోపీఆర్డీ భవాని తెలిపారు.

రంగంపేట: మర్రిపూడిలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్ముని ఆలోచనలు అందరూ అనుసరించాలన్నారు.

సోమవారం మహాత్మాగాంధీ జయంతిని సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు సుభద్రంపేటలో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ జీవిత చరిత్ర భారతీయుల గుండె చప్పుడు కావాలన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కూటిసాయి తాతారావు, అనపర్తి ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ, బలిరెడ్డి దుర్గారావు, వేము చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వేడుకలు

రాజానగరం: నియోజకవర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలలో సోమవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. దివాన్ చెరువు సొసైటీలో గాంధీ చిత్రపటానికి చైర్‌పర్సన్ గంగిశెట్టి సోమేశ్వర్రావు పూలమాల వేసి, నివాళులర్పించారు. రాజానగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మహాత్ముని విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్థానిక అన్నదాన సత్రం కల్యాణ మండప ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు మండవెల్లి వెంకన్నబాబు, గ్రామ అధ్యక్షుడు సముద్రాల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గ్రంధి నానబ్బులు పాల్గొన్నారు. పాలచర్లలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతిపిత విగ్రహానికి సంఘ సభ్యులు నాళం రోశయ్య, తమ్మన సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, వసంతరాయుడు, వేమగిరి కృష్ణ, గ్రామపెద్దలు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో సోమవారం మహాత్మాగాంధీ జయంతి ఘనంగా జరిగింది. ఆయన చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. కోరుకొండ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను సత్కరించారు. బూరుగుపూడి, నర్సాపురం తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు కేతినీడి అశోక్, కంటే వినయ్ తేజ, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మి సరోజ, ఉప సర్పంచ్ నేతుల చిన్ని, ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్, బూరుగుపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుడ్డిగ సత్తిబాబు పాల్గొన్నారు.

గాంధీ సిద్ధాంతాలు ప్రపంచానికే ఆదర్శం



నన్నయ వర్సిటీలో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు తదితరులు

రాజానగరం: జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలు దేశానికే ఆదర్శమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతిని పురస్కరించుకుని సోమవారం వారిద్దరి చిత్రపటాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శాంతి, అహింసను ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్ర్యాన్ని సాధించిన మహనీయుడు గాంధీజీ అన్నారు. విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా, మానవతావాదిగా ఎదిగిన గాంధీజీని మనమంతా ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందంజ వేయాలన్నారు. అలాగే లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానమంత్రిగా దేశాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. దేశంలో ఆకలి చావులు ఉండకూడదనే ఉద్దేశంతో అందరికీ ఆహారం అందేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి



గోకవరంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని గాంధీజీ విగ్రహాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు నివాళులర్పించారు. గోకవరం గాంధీపార్కులోని గాంధీజీ విగ్రహానికి పార్టీలకు అతీతంగా నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద గాంధీజీ విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దివాన్ చెరువు మాజీ సర్పంచ్ మృతి



అక్కిరెడ్డి మహేష్ (ఫైల్)

రాజానగరం: దివాన్ చెరువు మాజీ సర్పంచ్ అక్కిరెడ్డి మహేష్ (73) సోమవారం మృతి చెందారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఉన్న ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. దివాన్ చెరువు పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ, మాట పట్టింపుతో ఉద్యోగానికి రాజీనామా చేసి, రాజకీయాలలోకి వచ్చిన ఆయన నేరుగా ఒక పర్యాయం, పరోక్షంగా (ఉప సర్పంచ్ నుంచి సర్పంచ్‌గా) రెండో పర్యాయం దివాన్ చెరువు పంచాయతీ సర్పంచ్‌గా, ఒకసారి ఎంపీటీసీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో క్రియాశీలక పాత్ర వహిస్తూ వచ్చిన ఆయన వైఎస్సార్ సీపీ ఆవిర్భావం అనంతరం జక్కంపూడి కుటుంబం వెంట కొంతకాలం పయనించారు. తిరిగి టీడీపీ గూటికి చేరారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా అక్కిరెడ్డి మహేష్ మృతికి ఆయన సన్నిహితులు, దివాన్‌చెరువు సొసైటీ చైర్‌పర్సన్ గంగిశెట్టి సోమేశ్వర్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గంగి బ్రహ్మరాజు, ఆటోయూనియన్ అధ్యక్షుడు దాసరి శ్రీను తదితరులు సంతాపం తెలిపారు.

చిలుకూరికి గాంధీజీ సద్భావన పురస్కారం



పురస్కారం అందుకుంటున్న చిలుకూరి శ్రీనివాసరావు

కడియం: గ్రామానికి చెందిన కవి, ఉపాధ్యాయుడు, పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు గాంధీజీ సద్భావన పురస్కారాన్ని సోమవారం అందుకున్నారు. గాంధీ జయంతి సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, రాష్ట్ర మీడియా అకాడమీ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ యూనియన్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, మీడియా అకాడమీ కార్యదర్శి బాల గంగాధర తిలక్ పాల్గొన్నారు.